# వెరైటీ

పరశురామ్ మధ్యతరగతి మనిషి. బోలెడు అభ్యుదయ భావాలు ... అంతకు మించిన ఆశలు మనిసిలో కోకొల్లలు!

మనిషి మంచి మాటకారి!

పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం వేసే అలవాటు అతనికి లేదు. ఆడవాళ్ళ విషయంలో మాత్రం మోహనాస్త్రం ప్రయోగించి తనవైపు తిప్పుకోగల తెలివి అతని సొత్తు. అది అతని గొప్పతనం.

పరశురామ్‌తో ఎవరైనా ఒకసారి పరిచయమైతే, రెండో రోజు స్నేహంగాను, మూడవ రోజుకి ప్రేమగాను పరిణమిస్తుంది— అది అతనిలో ఉన్న గ్రేస్.

ఆరడుగుల ఎత్తు... కర్లీ హేర్... అందమైన కళ్ళు... మాటకారితనం ... వగైరా వగైరా ఉండటం అతని అదృష్టం.

చాలామంది లేడీస్‌తో అతనికి పరిచయం ఉందనే నిజం ప్రచారంలో ఉన్నా... అందరూ అతడినే లైక్ చేస్తారు. అతడంటే పడి చస్తారు.

ఆ రోజు వర్షం కుండపోతగా కురుస్తూంది.

మెయిన్ బిల్డింగ్ తప్ప మిగతా క్లాస్ రూము లన్నీ తాటాకు కప్పుతో ఉన్నవి కావటంతో క్లాసులు కంటిన్యూ చేయటం కష్టమైంది.

ప్రిన్సిపాల్ గారి అనుమతితో చివరి రెండు పీరియడ్స్‌ని కాన్సిల్ చేయటం జరిగింది.

అన్ని కాలేజీల్లో లాగానే ఆ కాలేజీలో కూడా మగ లెక్చరర్స్ వెయిటింగ్ రూమ్ ప్రక్కనే ఆడ లెక్చరర్స్ వెయిటింగ్ రూమ్ అంటి పెట్టుకుని ఉంది.

తడుస్తూనైనా సరే. క్లాసులో స్టూడంట్సు అందరూ వెళ్ళిపోయారు. వర్షం తగ్గేట్టు లేదు. ఇంకా క్లాసు రూము లోనే ఉంటే పూర్తిగా తడిసి ముద్దయి పోవచ్చుననే భయంతో క్లాసు రూమ్‌లోనుంచి బయటికొచ్చి తడుస్తూనే వెయిటింగ్ రూము వైపు దారితీశాడు పరశురామ్.

క్లాసురూమునుంచి వెయిటింగ్ హాలు సుమారు రెండు వందల గజాలైనా ఉంటుంది.

రుమాలు నెత్తిన వేసుకొని, చిన్న పరుగు లాంటి నడకతో సాగిపోతున్నాడు.

"పరుగెట్టకండి. జారి పడగలరు..." గొడుగులో వస్తున్న హిస్టరీ మేడమ్ సుజాత హెచ్చరించింది.

"అట్లా వంకలు పెట్టకపోతే కాస్త మీ గొడుగు క్రింద ('హృదయంలో కూడా' అనే భావన స్ఫురించేట్టు) చోటివ్వకూడదూ?"— నడక వేగం తగ్గించి, పక్కకు తిరిగి సుజాత కళ్ళల్లోకి చురుగ్గా చూస్తూ అన్నాడు.

"అలాగే... రండి!— లేకపోతే రూమ్ చేరుకునే లోగా ముద్దయి పోతారు...."

అవకాశాన్ని... సుజాత ఆహ్వానాన్ని వృథా కానివ్వ తలచుకొని పరశురామ్ గొడుగు క్రింద చోటు చేసుకున్నాడు ప్రస్తుతానికి!— మరి హృదయంలో చోటు ఎప్పుడు దొరుకుతుందో అనేసి మనసులోనే అనుకున్నాడు.

లేడీస్ అంబరిల్లా కావడంతో చిన్న సైజులో ఉంది.

అంత చిన్న గొడుగు క్రింద ఎవరి మటుకు వాళ్ళు తడవకుండా ఉండాలనే ప్రయత్నం మరీ ఇబ్బందికరంగానూ ఉంది.

చినుకులు... ఈదురుగాలి... సగం తడిసిన బట్టలు... ఒదిగి నడవడంతో శరీరాల తాకిడికి ఉత్పన్నమవుతున్న సన్నటి వేడి... వీటన్నిటి తాలూకు ఇరువురి మనసుల్లో రక రకాల ఆలోచనలు...

నడుస్తున్నారు.

ఇద్దరూ కలిసి ఒకే గొడుగు క్రింద నడవటం ఎవరైనా చూస్తారేమో... ఆక్షేపిస్తారేమో అనే భయం... బిడియం సుజాతలో ప్రవేశించాయి.

వీలైనంత దగ్గరగా ఆమెను రాచుకుంటూ నడవాలని ప్రయత్నం చేస్తున్నాడు పరశురామ్.

అదొక దివ్యమైన అనుభూతి!

ఆలోచనలు అతడిని పీక్కు తింటున్నాయి. మనసును దూర తీరాలకు లాక్కెడుతున్నాయి.

వెయిటింగ్ రూమ్ చేరుకోగానే 'థాంక్స్' చెప్పి తప్పని సరిగా గదిలోకి జొరబడాల్సి వచ్చింది పరశురామ్.

"పాడు వెయిటింగ్ రూమ్... అప్పుడే వచ్చేసిందా..." అనే భావన సుజాత ముఖంలో ద్యోతకమైంది.

*   *   *   *

"ఏమోయ్, పరశురామ్..." నువ్వు యాక్టు చేసిన పిక్చరు రిలీజైందట! ఏ హాల్లో? మమ్మల్నందర్నీ నీ ఖర్చుతో తీసుకెళ్ళి సినిమా చూపిస్తే... నువ్వు బాగా నటించావో,

లేదో చూచి చెప్పేస్తాం. అంతేకాదు... బాగున్నా బాగుం డక పోయినా మరో పది సార్లు చూచి నీ మొదటి పిక్చరు శతదినోత్సవం జరుపుకునేట్లు చేస్తాం! ఆ తర్వాత... నీకు ఆఫర్లమీద ఆఫర్లు!!— మా అభీష్టాన్ని మాత్రం కాద నకు..." తెలుగు లెక్చరర్ దామోదరం అందరి తరపున లీడర్‌షిప్ తీసుకుని అడిగేశాడు.

"మీ అందరినీ నా ఖర్చుతో తీసుకెళ్ళ గల ఆర్థిక స్తోమత నా కెక్కడిదీ" అనేసి తప్పుకున్నాడు పరశురామ్. ఈ మధ్య అతనో బడ్జెట్ చిత్రంలో 'ఫ్రీ'గా నటించి వచ్చాడు.

మార్నింగ్ షో చూసొచ్చిన స్టూడెంట్సు ఈవెనింగ్ క్లాసులో లెసన్ టేకప్ చెయ్యనివ్వలేదు సరికదా, తమ మొదటి సారిగా 'కెమరా' ముందు నిల్చున్నప్పటి అను భూతి... భవిష్యత్ కార్యక్రమాల గురించి.... రకరకాల ప్రశ్నలతో ఊపిరి తీసేశారు.

కానీ... అంతరాంతరాల్లో అనిర్వచనీయమైన ఆనం దం... గొప్ప థ్రిల్ ఫీలయ్యాడు పరశురామ్, అందరూ అన్నేసి ప్రశ్న లడుగుతూంటే.

మేడమ్ సుజాత.... మరో నలుగురు ఆడ లెక్చరర్లు, విషయం తెలుసుకుని పరశురామ్‌ని హృదయ పూర్వకంగా అభినందించారు.

కేవలం తానొక తిరుగుబోతు.... స్త్రీలోలుడు అనే అభిప్రాయంతో ఉండి తనకేసి అసహ్యంగా చూచే శశికళ కూడా నవ్వుతూ పలకరించి అభినందించింది.

శశికళ మెచ్చుకోలు కోసమే ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్నాడు పరశురామ్.

"చివరి సీన్లో... మీలో కలిగిన మానసిక పరివర్తనకు మీరు చూపిన ఫీలింగ్సు చాలా అద్భుతంగా ఉన్నాయి.." మళ్ళీ శశికళే అంది.

మరోసారి 'థాంక్స్' చెప్పాడు.

వట్టి థాంక్సు ఎవరిక్కావాలన్నట్టు పరశురామ్ కళ్ళల్లోకి చూచింది శశికళ:

మరేం కావాలి మీకు అనే భావనతో శశికళ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు పరశురామ్.

ఇంకా వివరంగా మాట్లాడుకుందుకు వ్యవధి లేకపోవటంతో ఎవరి క్లాసు రూముల్లోకి వాళ్ళు వెళ్ళిపోక తప్పలేదు.

*　　*　　*　　*

ఏరి కోరి చేసుకున్న భర్త స్కూటరు యాక్సిడెంటులో చనిపోటంతో... రెండేళ్ళయినా నిండకుండానే కడుపు నో కాయ కాయకుండానే పసుపూ కుంకుమా దూరమైంది సుజాతకు.

మామగారి రికమెండేషన్‌తో ఆ ఊరి కాలేజీలో లెక్చరరుగా చేరింది.

సుజాతలో బలహీన తేమిటో బహు తేలిగ్గా పసిగట్టగలిగాడు పరశురామ్.

అవకాశం దొరికాక సమ్మోహనాస్త్రం ప్రయోగించి నగ్గాడు.

ఒక రోజున... "సుజాతా!... మీరు చాలా అందంగా ఉంటారు. కానీ ఆ దేవుడు మీ సౌందర్యాన్ని చూచి ఓర్వలేక తన కళ్ళల్లో నిప్పులు పోసుకోవటమే కాకుండా మీ బ్రతుకులో నిప్పులు కురిపించి, మిమ్మల్ని అన్యాయం చేయటం నిజంగా దురదృష్టం..." అని ఎవ్వరూ లేని సమయం చూచి సానుభూతిగా అన్నాడు.

ఆ మాట విన్న సుజాత మనస్సు..... ఆలోచనలు వర్తమానంలోంచి గతంలోకి పరుగెత్తినా.... ముఖంలో విషాదచ్ఛాయలు దోబూచులాడినా "పోనిద్దురూ, కథ అడ్డం తిప్పాడా భగవంతుడు.... బాడ్ లక్..." అనేసింది.

"లక్ దేమిటండీ!...జీవితం కేవలం లాటరీ టిక్కెట్టు లాంటిది. అంతమాత్రంచేత రూపాయి పారేసి టిక్కెట్టు కొనేసిన ప్రతివాడినీ వరించదు! అనుభవించే అదృష్టం... పొందే అవకాశం ఏ కొందరికోగానీ లభించదు..." ఆ అదృ

ష్టం తనదే అవబోతున్న ఫీలింగు పరశురామ్ మాటల్లో ధ్వనించింది.

కాలేజీ టైమ్ అయిన తర్వాత దూరంగా ప్లే గ్రౌండులో కూర్చుని ఆ సాయంత్రం కబుర్లలోకి దిగారు ఇద్దరూ.

సంభాషణ ఎవరు ప్రారంభించాలా, ఎలా ప్రారంభించాలా అని ఎవరికి వారు ఆలోచిస్తూ మౌనంగా దిక్కులు చూస్తూ ఉండిపోయారు కొద్ది క్షణాలు.

"పిక్చర్లో మీ వేషం... అభినయించిన తీరూ అద్భుతంగా ఉంది. రియల్లీ! మీరో పెద్ద స్టారైపోతే మేం గుర్తుంటామా..." సంభాషణ సుజాతే ప్రారంభించింది.

"డోన్ట్ బి సిల్లీ! — కట్టుకున్న భార్యనైనా మర్చిపోవచ్చేమోగానీ... మనసిచ్చిన స్నేహితులను మర్చిపోయేటంత కుసంస్కారం నాలో లేదు. బిలీవ్ మీ!!"

పరశురామ్ జవాబుకి సుజాత వదనంలో చిరునవ్వు, అంతకు మించిన సంతోషం చోటు చేసుకున్నాయి.

"నవ్వకండి... నవ్వితే మీ అందమైన చెక్కిళ్ళు సొట్టలు పడతాయి. ఆ తర్వాత నాకు మతే పోతుంది" ఆడదాన్ని పొగిడితే తప్పక ప్రసన్నురాలౌతుందనే పచ్చి నిజం తెలిసినవాడు పరశురామ్. అందుకే లౌక్యాన్ని ప్రదర్శించాడు.

"చాల్లెద్దురూ మీ పొగడ్తలూ... వెళదాం, పదండి. చీకటి పడుతోంది..."

కూర్చున్న వాళ్ళల్లా లేచి గ్రౌండు దాటి రోడ్డెక్కారు.

*　　*　　*　　*

చాలా రోజుల తర్వాత ఇంగ్లీషు పిక్చరు చూద్దా మనిపించడంతో ఆరు కొట్టేసరికి లీలా మహల్ చేరుకున్నాడు పరశురామ్.

'హౌస్ ఫుల్' బోర్డు కన్పించింది! పది గజాల దూరంలో ఒంటరిగా నిల్చుని దిక్కులు చూస్తున్న శశికళ కూడా కనిపించింది.

ఆమెను పలకరించాలనే ఉద్దేశంతో ఆమెకు దగ్గరగా వెళ్ళాడు.

"లేట్‌గా వచ్చా రేమిటీ?... ఆదివారం కదా— కాస్త ముందుగా వస్తే బాగుండేది..." శశికళే పలకరించింది.

"దేనికైనా ప్రాప్త ముండాలి..." సిగరెట్ వెలిగిస్తూ అనేశాడు.

"నిరుత్సాహ పడకండి. నా దగ్గర మరో టిక్కెట్టుంది..."

శశికళ అందించిన టికెట్ పుచ్చుకుని థాంక్స్ లాంటి నవ్వు రువ్వాడు. అంతటితో ఆగకుండా తన కిచ్చిన టిక్కెట్టు ఎవరికోసం కొని ఉంటుందా అని సీరియస్‌గా ఆలోచించ సాగాడు.

ఎవరికైతే ఏంలే అని అంతలోనే సరిపెట్టుకుని "ఏమిటి మీ పరధ్యానం? అవతల న్యూస్ రీల్ మొదలైంది. మీ రింకా ఆలోచిస్తూ నిల్చుంటే ఇంటర్వెల్ కూడా అవుతుంది- పదండి..." తొందర చేశాడు.

శశికళ నడిచింది!

పరశురామ్ ఆమెను అనుసరించాడు.

గేటు దగ్గర కుర్రాడు టార్చిలైటు వేసుకుంటూ వచ్చి సీట్లు చూపాడు.

రెండూ పక్క పక్క సీట్లే కావటం అదృష్టంగా భావించాడు పరశురామ్.

మీ ప్రక్కనే కూర్చోవలసి వచ్చింది..." నసిగాడు పరశురామ్ సభ్యత ప్రదర్శిస్తూ.

"ఫర్వాలేదు — మీ కేమైనా అభ్యంతరమా?" ఎదురు ప్రశ్న వేసింది శశికళ.

"మీ ఇష్టమే నా ఇష్టం..." అనేశాడు.

ఇద్దరూ కూర్చున్నారు.

పరశురామ్ దృష్టి సినిమామీదే ఉన్నా.... మనసు మాత్రం ఏవేవో ఆలోచనలను ప్రేరేపిస్తూంది.

'హేండ్ రెస్టు' మీద ఇద్దరూ ఒకేసారి చేతులు పెట్ట టంతో ఇద్దరి మోచేతులూ తగిలి శారీరకమైన స్పర్శ ఇద్దరి లోనూ నవ్యానుభూతిని కలిగించింది.

'సారీ' అనబోయిన వాడల్లా ఆగి శశికళ ముఖంలోకి చూశాడు.

చీకట్లో శశికళ పెదాల మీద నాట్యం చేసిన చిరునవ్వు... వర్షించబోతున్న ఆకాశంలో తళుక్కున మెరిసిన మెరపులా ఉంది.

"మీరు చాలా అందంగా నవ్వుతారు...' అనకుండా ఉండలేక పోయాడు.

ఒక్క రెప్పపాటు ఆగి, "సుజాతకంటేనా..." అని పక్కగా వంగి కొంటెగా అంది.

ఆ మాట వీపు మీద చెర్నాకోలతో కొట్టినట్టనిపించింది పరశురామ్‌కి.

"సుజాతంటే మీకు గిట్టదా?" తమాయించుకొని అడిగాడు.

"మనిషి మంచిది కాదని అనుకుంటారంతా. విధవ అయినా షోకులు చేసుకుంటుందని అందరికీ అసూయ..."

శశికళ మనసులోని అభిప్రాయాన్ని మరెవరిమీదనో పెట్టి వ్యక్తం చేసిందనే విషయం పసికట్టాడు పరశురామ్. ఆడబుద్ధి పోనిచ్చుకుంది గాదు; అనేసి సరిపెట్టుకున్నాడు ప్రస్తుతానికి.

"మనిద్దరం కలిసి సినిమా చూశామని ఎవరికీ తెలియ నివ్వకండి..." శశికళే అంది మళ్ళీ.

తెలియనివ్వకూడని వ్యక్తి బహుశా సుజాతే అయి ఉండాలి అన్పించింది.

శశికళ స్త్రీత్వంలోని అభిమానం... స్వతస్సిద్ధమైన జంకు... అంతరాంతరాల్లో దాగి మాటలద్వారా వ్యక్తమవుతున్న భయం కొట్టవచ్చినట్టు కనిపించింది పరశురామ్‌కి.

"తానొక అందగత్తెనని... సుజాతకు తగని గర్వం.." సంభాషణ మళ్ళీ సుజాతమీదకే మళ్ళించింది శశికళ.

సుజాతపట్ల అసూయకంటే.... తాను ఆమెకి దగ్గరవటం శశికళకు బొత్తిగా ఇష్టంలేదనే విషయం పూర్తిగా గ్రహించాడు పరశురామ్.

అదీ నిజమే. అతనికి దగ్గరవాలంటే, మరొకరిపట్ల ఆసక్తి లేనట్టు ఉండాలి. లేదూ – నటించాలి.

"నాకు బొద్దుగా వుండే ఆడవాళ్ళంటే... ఎందుకో అభిమానం తక్కువ. మీలాగా స్లిమ్‌గా, ట్రిమ్‌గా ఉంటేనే లైక్ చేస్తాను." మరో చెణుకు విసిరాడు.

పరశురామ్ కాంప్లిమెంటుకి మరింత వంకర్లు తిరిగిపోయింది శశికళ.

అంతా గమనిస్తూనే ఉన్నాడు.

"ఓకే, పరశురామ్. యువార్ రియలీ ఎ లక్కీ ఫెలో–తప్పు లేదు. గో ఎహెడ్..." అనేసి అంతరాత్మ ప్రోత్సహించింది.

ఇంటర్వెల్లో చెరొక డ్రింకూ తాగారు. డబ్బులు శశి కళే ఇచ్చింది. 'పాప్ కారన్' పేకెట్ కొన్నాడు పరశురామ్.

మళ్ళీ పిక్చరు మొదలైంది.

ఇద్దరి గుసగుసలూ ఆరంభమైనాయి.

శశికళ కాళ్ళకు అప్పుడప్పుడు తన కాళ్ళను తగిలిస్తు న్నాడు పరశురామ్.

'లవ్ సీను' వచ్చినప్పుడల్లా మోచేతితో శశికళ తన చేతిని నెట్టడంకూడా గమనించకపోవటం లేదు పరశురామ్.

భాషలో కాకుండా కేవలం స్పర్శతో ఒకరి భావాలు మరొకరు తెలుపుకుంటూ సరదా తీర్చుకొంటున్నారు.

తొమ్మిది కొట్టక ముందే 'శుభం' స్లైడు వేశాడు తెరమీద.

"పాపిష్ఠి సినిమా అప్పుడే అయిపోయిందా..." అనిపించింది ఇద్దరికి.

"నేను రిక్షాలో వెడతాను – మరి... మీరో?" హాల్లోంచి బయటికొస్తూ అంది శశికళ.

ఏమి టీ విచిత్రం? ఎవరితోనో కొత్తగా మాట్లాడు తున్నట్టూ... తనతో పరిచయం లేనట్టే ఎంచక్కా రిక్షా ఎక్కి కూర్చున్న శశికళ నెత్తిన మొట్టికాయ వేయాలన్పిం చింది పరశురామ్కి.

ఇద్దరం కలిసి ఆటోలో వెడదామని అంటుందేమోనని ఆశించాడు. కానీ నిరుత్సాహమే ఎదురైంది.

శశికి తాను ఏమీకాడా?! మరి.. ఏమీ కాకపోతే సినిమా చూస్తున్నంత సేపూ ఆ పరిహాసాలూ... చూపించిన చొరవా, చనువూ ఎందుకట?!

పరశురామ్‌కి పరిస్థితి అయోమయంగా తోచింది. విషయం బోధపడక బుర్ర గోక్కున్నాడు.

*  *  *  *

"ఈ వారం ప్రారంభమైన మీ సీరియల్ చదివాను. ఓపెనింగ్ చాలా బాగుంది..." వరండాలో పరశురామ్ పక్కగా నడుస్తూ అంది శశికళ.

"చదివేరా? అప్పుడే ఏమైందీ.... నవల సగం నుండి గానీ కథ పట్టుగా ఉండదు...." హుషారుగా జవాబిచ్చాడు పరశురామ్.

"మీరు రచయితలనే విషయం ఎప్పుడూ చెప్పనే లేదేం?"

"చెబితే ఏం చేసేవారూ?"

"రచయితలంటే నాకెంతో ఇష్టం. ఆ కారణంగా.... మీ సీరియల్ చదవటం మొదలు పెట్టేక మీ మీద అభిమానం మరింత పెరిగింది".

"అంతేనా?!"

పరశురామ్ ప్రశ్నకు జవాబిచ్చే అవకాశం లేకపోయిన శశికళ క్లాస్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది – మిగతా వివరాలు వచ్చే సంచికలో అన్నట్టు!

'లంచ్' అవర్లో ఆ రోజు లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో గుసగుసలు మొదలైనాయి.

"విన్నావా, లతాదేవీ.... సుజాత వ్యవహారం మరీ శ్రుతి మించుతోందట...." సివిక్సు ట్యూటరు వనజాక్షి అందుకుంది.

జవాబుగా లతాదేవి ఏదో అనబోయింది.

ఇంతలో "అందరం ఆడవాళ్ళమే. ఒకరి వ్యక్తిగత విషయాలు నలుగురు కలిసి చర్చించుకోవటం సభ్యత అనిపించుకోదు" అనేసి భగీరథమ్మ వార్నింగిచ్చింది.

అంతటితో నోరుముయ్యని వనజాక్షి,

"చాటుమాటు వ్యవహారం పోయి పరశురామ్‌గారిని నేరుగా ఇంటికే రప్పించుకుంటున్నదట" అని మరో మాట జారింది.

"తిని కూర్చుంటే ఊరా పేరా?! కట్టుకున్న వాడు కాస్తా హరీ అన్నాడు. ఇహ అంతా విచ్చలవిడే..." మనసులోని క్రోధం పట్టలేక బయటికి కక్కేసింది శశికళ.

"శ్రీరంగనీతుల కేంలే... నువ్వు సినిమాకు వెంటే

సుకు తిరగంగా లేంది... నే చేస్తే వచ్చిందా..." అప్పుడే గదిలోకి అడుగు పెట్టిన సుజాత కడుపుమంట పట్టలేక అనేసింది.

"అంతా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళం. పై పెచ్చు.... ఒకరికి చెప్పగలిగే స్థితి మనది! అలాంటిది మనలో మనం ఇలా కీచులాడుకోవటం వినేవాళ్ళకి ఎంత చులకనగా ఉంటుంది?" చివరిసారిగా చురకేసింది భగీరథమ్మ,

అందరి నోళ్ళూ మూతలు పడ్డాయి.

వెయిటింగ్ రూములో జరిగిన కీచులాట సంగతి సాయంత్రం అయిదు గంటలు కాకముందే కాలేజీ అంతా వ్యాపించింది.

మరునాటి ఉదయానికల్లా కాలేజీ గోడలనిండా సుజాత, పరశురామ్‌ల గురించి పబ్లిసిటీ వచ్చేసింది.

ఇద్దరినీ విడివిడిగా పిలిచి ప్రిన్సిపాల్ వార్నింగిచ్చాడు. మరోసారి ఇలాంటిది జరిగితే 'డిస్మిస్' చేస్తానని బెదిరించాడు.

మూడో రోజు సుజాత కాలేజీకి రాలేదు. కనీసం సెలవు చీటీ అయినా పంపలేదు.

సుజాత 'స్లీపింగ్ పిల్స్' మింగిందనే నిజం నాలుగో రోజు అందరికీ తెలిసిపోయింది.

ఆ రోజే కాంటిన్ నుంచి ఒంటరిగా నడిచి వస్తున్న శశికళకు ఎదురైన పరశురామ్ చిరునవ్వుతో పలకరించి 'సెకండ్ షో' కి ఆహ్వానించాడు.

"సుజాత మీ మూలంగానే చచ్చిపోయింది. నా ప్రాణాన్ని కూడా మీ దాహానికి బలి తీసుకోకండి...." అనేసి తలొంచుకుని ముందుకు సాగిపోయింది శశికళ.

వెరైటీకోసం తాపత్రయ పడే పరశురామ్ నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

[5-4-78 ఆంధ్రప్రభ వార పత్రిక]

---

కళ్ళు మిరుమిట్లుగొలిపే తెల్లని తెలుపు బట్టల మురికిని మటు మాయం చేసేటందుకు వాడండి నమ్మకమైన "సోనా" డిటర్జంట్ బట్టల సోప్.



నాణ్యతకు నమ్మికకు పేరెన్నిక గన్న అగ్గిపెట్టెలు

# 'గంట' మార్కు




వాడకందారుల తృప్తే మా నిరంతర కృషికి ఫలితం!

చేతిపనులకు చేయూత నివ్వటం మా ధ్యేయం.

మురళి మేచ్ వర్క్స్,

ఫోన్: 2183

చిత్తూరు (ఆం.ప్ర.)